క్లుప్తంగా

డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన లారీ



కాటారం: మిర్చి లోడ్‌తో ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటన మండలంలోని బయ్యరం క్రాస్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మిర్చి లోడ్‌తో వ్యాన్ మహదేవపూర్ నుంచి వరంగల్‌కు వెళ్తుంది. బయ్యారం క్రాస్ సమీపానికి రాగానే వ్యాన్‌లో డీజిల్ అయిపోవడంతో పెట్రోల్ బంకు సమీపంలోని రోడ్డుపై డ్రైవర్ వాహనాన్ని నిలిపాడు. అటుగా భూపాలపల్లి నుంచి వస్తున్న లారీ గమనించకుండా అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వాహనం ముందు భాగంగా నుజ్జునుజ్జు కాగా వ్యాన్ డ్రైవర్ స్వామికి తీవ్ర గాయ్యాలయ్యాయి. గమనించిన స్థానికులు స్వామిని చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరికి గాయాలు



గోవిందరావుపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పస్రా పరిధి అటవీ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మగాని శ్రీనివాస్, రాజ్‌కుమార్ కర్కగూడెం నుంచి వరంగల్ వైపు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలు అవడంతో పాటు కుడి కాలు విరిగింది. అదే విధంగా కుమార్ కుడి చేయి విరిగింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

నియామకం



రాజేందర్‌రెడ్డి

రేగొండ: కొత్తపల్లిగోరి బీజేపీ మండల అధ్యక్షుడిగా సూరిగురి రాజేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కాటారం: మండలంలోని ధన్వాడ, శంకరాంపల్లి, గంగారం, విలాసాగర్, జాదారావుపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సీఈఓ ఎడ్ల సతీశ్ ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది అమీన్, రాజబాబు పాల్గొన్నారు.

రైతు నేస్తానికి స్పందన కరువు



రేగొండ: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు సాగులో మెలకువలతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, నిపుణులతో క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి రూపకల్పన చేసింది. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రతి మంగళవారం, శుక్రవారం రైతు వేదికల్లో దృశ్య శ్రవణ విధానంలో సాగులో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. కానీ, రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు. మంగళవారం రేగొండ రైతు వేదిక కార్యాలయంలో మట్టిలో సేంద్రియ కార్బన్‌ను ఎలా పెంచాలి, వరి పంట కొయ్య కాళ్లను మట్టిలో కలపడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయితే కార్యక్రమంపై రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో అవగాహన కార్యక్రమానికి రైతుల కంటే వ్యవసాయ అధికారులే ఎక్కువగా హాజరుకావడం గమనార్హం.

దాహం తీరేదెలా..?

- తాగునీటి కోసం అల్లాడుతున్న జనం
- చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రాని అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్‌లలో తాగునీటి వసతి కరువు
- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఏటూరునాగారంలో చలివేంద్రం ప్రారంభం(ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి : ఎండల తీవ్రత ఎక్కువ అవడంతో వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు కొనసాగించే ప్రజలు దాహం తీర్చుకునేందుకు తాగునీటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జిల్లాలోని 9 మండలాల్లో అధికారులు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహం తీర్చేవారు. ముఖ్యంగా జన సంచారం ఎక్కువ ఉండే బస్టాండ్, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల వద్ద గతంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది జిల్లాలో ఎక్కడా చలివేంద్రాలు కానరావడం లేదు. ప్రజలు వారి దాహార్తిని తీర్చుకునేందుకు డబ్బులు పెట్టుకొని వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

జిల్లాలోని 9 మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కనీసం తాగునీటి వసతి కానరావడం లేదు. వివిధ మండల కేంద్రాలు, గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. గంటల తరబడి కార్యాలయాల్లో పనుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. కనీసం ఆయా కార్యాలయాల్లో అధికారులు మంచినీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎండ వేడిని దృష్టిలో పెట్టుకొని అధికారులు తాగునీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉండగా అవేమి పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆధార్ అప్‌డేట్ కోసం తాడ్వాయి మండల కేంద్రంలోని రెండు మీసేవా కేంద్రాలకు అనుమతి ఇవ్వడంతో వెంకటాపురం(కె), వాజేడు, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాలకు చెందిన ప్రజలు వందల సంఖ్యలో వస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ అప్‌డేట్ కోసం వేచిఉండాలి ఉంటుంది. అక్కడ కూడా కనీసం తాగునీటి వసతి లేకపోవడంతో దూపతీర్చుకునేందుకు తండ్లాడుతున్నారు.

ముందుకురాని స్వచ్ఛంద సంస్థలు..

ఎండల తీవ్రతతో ప్రజలు నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. గతంలోమాదిరిగి చలివేంద్రాలు ఏర్పాటు చేసి తమ గొంతుతడపాలని కోరుతున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకొని జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. మేడారానికి బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో వేలాదిగా భక్తులు తరలివస్తారు. వారికి కనీసం తాగునీటి వసతి లేదు. ఆలయ పరిసరాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే భక్తుల దాహం తీరుతుంది.

– అరెం లచ్చుపటేల్, మేడారం జాతర కమిటీ బాధ్యుడు

బాల్యవివాహాలతో అనేక ఇబ్బందులు



అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణ విభాగం బాధ్యులు

ములుగు రూరల్: బాల్యవివాహాలతో అనేక ఇబ్బందులు తప్పవని చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని జాకారం గ్రామంలోని చెరువు వద్ద మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పని చేస్తున్న కూలీలకు బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాలు, బాలల హక్కులు, బాలలపై లైంగిక వేధింపులు, అక్రమ దత్తత చట్టం తదితర అంశాలపై బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో రాంబాబు మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడమంటే బాలల హక్కులను హరించడమేనని అన్నారు. బడి బయటి బాలలను బాల కార్మికులుగానే పరిగణించడం జరుగుతుందని అన్నారు. బాల్యం ఎంతో అమూల్యమైన దశ అని, అమూల్యమైన బాల్యంలో పిల్లలంతా తమ హక్కులను స్వేచ్ఛగా అనుభవించేలా చూడటం మనందరి బాధ్యత అన్నారు. బాల కార్మిక నిషేధ క్రమబద్ధీకరణ చట్టం -2016 ప్రకారం 14సంవత్సారాల లోపు పిల్లలని ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారి పైన చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రజిని మాట్లాడుతూ.. అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన లేబర్ కార్డ్, ఈ-శ్రమ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడం ద్వారా కలిగే వివిధ రకాల ప్రయోజనాలు వివరించారు. మైనర్ పిల్లలకి బాల్య వివాహాలు.. ముఖ్యంగా ప్రేమ వివాహాలు ఎక్కువగా జరగడం వల్ల వాటిని పీఓసీఎస్ఓ కేసులుగా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. అలాంటి వారికి కనీస జైలు శిక్ష 2సంవత్సరాల నుంచి 7సంవత్సరాల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంతోశ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ హరీశ్

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఊర చెరువులో ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో చేపడుతున్న ఫిష్ బ్రీడింగ్ పనులను ఏపీఓ గిరి హరీశ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.300 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ పందిరి, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రేగ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీర సంతోశ్ పాల్గొన్నారు.

‘అమ్మ’ కమిటీల అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మంగపేట:మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు రైతువేదిక కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్న సదస్సులో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు, మహిళా పొదుపు సంఘం సభ్యులు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందన్నారు. మండలంలోని పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల్లో నీటివసతి, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, తదితర మరమ్మతు పనులను చేపట్టేందుకు ఒక్కో పాఠశాలకు రూ.2లక్షల చొప్పున 20 పాఠశాలలకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అవసరమైన పనులను కమిటీ చైర్మన్, సభ్యులు, పాఠశాల హెచ్ఎం, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారితో కలిసి గుర్తించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ తుల రవి, సెర్ప్ డీపీఎం గోవింద్‌చౌహాన్, ఐటీడీఏ ఏఈ రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనిన అన్నారు. మండల పరిషత్ కార్యాయలంలోని సమావేశ మందిరంలో మంగళవారం పాఠశాల హెచ్ఎంలు, వీఓలతో సమీక్ష సమావేశం మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనిన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత లెనిన మాట్లాడుతూ.. మండలంలో మంజూరైన అమ్మ ఆదర్శ పాఠశాలలో తాగు నీరు, విద్యుత్, టాయిలెట్ తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. టాయిలెట్‌లు మరమ్మతులు, కొత్త టాయిలెట్ల నిర్మాణం, క్లాస్ రూమ్‌ల మరమ్మతులు చేపట్టాలని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ హనుమంతరావు, పీఆర్ఎఈ రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: దేశంలో అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ప్రజలు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య కోరారు. మంగళవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా బీసీ మోర్చా నాయకుడు కంబాల రాజయ్య ఆధ్వర్యంలో 16, 17, 18 పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ.. కరోనా నుంచి ఇప్పటి వరకు కూడా రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తున్న ఘనత బీజేపీ ప్రభుత్వానిదే అన్నారు. దేశంలో మరోసారి మోదీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని అన్నారు. నాగపూరి రాజమౌళి గౌడ్, దొంగల రాజేందర్, మండల రఘునాథరెడ్డి, కుమార్, శంకర్, రవీందర్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశం సుభిక్షం

రేగొండ: మోదీ పాలనలోనే దేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగపూరి రాజమౌళి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మంగళవారం రేపాక, రాయపల్లి, తిరుమలగిరి గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. ప్రజలు మోదీని మరోసారి ప్రధానిని చేయాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సుంకరి మనోహర్, కిరణ్, శోభన్, ప్రశాంత్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉత్సవాలు



భద్రాచలం నుంచి వచ్చిన తలంబ్రాలను తీసుకొస్తున్న భక్తులు



పాలపారకను తీసుకొస్తున్న గ్రామస్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో సీతరాముల కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నేడు శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున హాజరై పసుపు కొమ్ములను దంచి పసుపు, బియ్యం కలిపి తలంబ్రాలను తయారు చేశారు. ఉదయం అడవి నుంచి పాలపారకను తీసుకువచ్చి రామాలయంలో ఏర్పాటు చేసిన పచ్చని పందిరిపై కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు అలంకరించారు. అనంతరం నిత్యారాధణ, అభిషేకం, ఆరగింపు, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే భద్రాచలం నుంచి తీసుకువచ్చిన ముత్యాల తలంబ్రాలను మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి మేళతాళాలతో నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరవేశారు. ఈ తలంబ్రాలను బుధవారం నిర్వహించే కల్యాణ తంతులో వినియోగించనున్నట్లు అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోగుల లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ లాహోటీ, తాడూరి రఘు, కమిటీ సభ్యులు గాడిచర్ల సాంబయ్య, దీనబంధుస్వామి, శ్రీను, బ్రహ్మం, సదానందం, శ్రీను, సంతోశ్, ప్రసాద్, సంతోష్, రాజేశ్, రమేశ్, గడ్డం వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చతోరణాలు.. చలువ పందిళ్లు

కన్నాయిగూడెం: సీతారాముల కల్యాణానికి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం నుంచే ఇందుకు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నారు. పచ్చతోరణాలతో, చలువ పందిళ్లు, రంగుల విద్యుత్ దీపాలతో కల్యాణ మండపాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు వైభవంగా తీర్చిదిద్దారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉండడంతో తాటి ఆకులతో చలువ పందిళ్లు వేశారు. బుధవారం మధ్యాహ్నం సీతారాముల కల్యాణం వైభవంగా జరిపిస్తామని నిర్వాహక కమిటీ బాధ్యులు మంగళవారం వెల్లడించారు.

శ్రీరాముడి పట్టాభిషేకం వేడుకలు

మంగపేట: మండల కేంద్రంలోని శ్రీ వైష్ణవి ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపాల్ రావుల రాజేశ్వర్రావు ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముని పట్టాభిషేకం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు రాముడి పట్టాభిషేకం కార్యక్రమంలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు, బ్రహ్మ, నారదుడు, మహాశివుడి వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు రాజశ్రీ, అనూష, కావేరి తదితరులు పాల్గొన్నారు.



పసుపును దంచుతున్న మహిళలు



శ్రీరాముడి పట్టాభిషేకం కార్యక్రమంలో వివిధ వేషధారణలో విద్యార్థులు



కన్నాయిగూడెం: గుర్రేవుల ఆలయంలో చేసిన ఏర్పాట్లు

బోరు మోటారు వైర్ల చోరీ

గార్ల: గార్ల పట్టణం సమీపంలోని పాకాల ఏటి వద్ద గల వైకుంఠధామంలో రాత్రి సమయంలో రూ.35,000 విలువ గల బోరు మోటారు కేబుల్, సర్వీస్ వైరు, నల్లాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు పంచాయతీ కార్యదర్శి కుమార స్వామి మంగళవారం తెలిపారు. గత నెల రోజుల క్రితమే దొంగలు వైకుంఠధామం వద్ద చోరీకి పాల్పడి బోరు మోటారుకు సంబంధించిన రూ.30,000 విలువ గత వస్తువులు ఎత్తుకెళ్లారని, 5 రోజుల క్రితం బోరు మోటార్‌కు మరమ్మత్తులు చేయించామన్నారు. మళ్లీ రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. పాకాల ఏటి రక్షిత మంచినీటి పథకం వద్ద రూ.28,000 విలువ గల సర్వీస్ వైరును సైతం దొంగిలించారని తెలిపారు.

అడవిని రక్షించుకోవడం బాధ్యత



మంటలను ఆర్పుతున్న అధికారులు



మంటలార్పుతున్న అటవీ సిబ్బంది



యంత్రాల సాయంతో ఆర్పుతున్న సిబ్బంది

పలిమెల: అడవిని రక్షించుకోవడం అందరి బాధ్యత అని మహదేవ్‌పూర్ ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి అన్నారు. పలిమెల రేంజ్ సౌత్ జోన్ బీట్ బోడాయిగూడెం పరిధిలోని అడవికి కార్చిచ్చు అంటుకోగా ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి, ఎఫ్ఆర్ఓ వెంకటేశ్వరరావు సమక్షంలో మంటలను అదుపు చేశారు. దీంతో మహాముత్తారం మండలం యత్నారం, నిమ్మగూడెం, పెగడపల్లి సౌత్ బీట్‌లలో కూడా అటవీకి అంటుకున్న మంటలను ఆర్పి వేసినట్లు తెలిపారు. కామనపల్లి వెస్ట్ పరిధిలోని ఏర్పాటు చేసిన సోలార్ బోర్‌వెల్ వల్ల వన్యప్రాణులకు నీటిని అందజేస్తున్నామన్నారు. అడవిలో వన్యప్రాణులకు నీరు అందిచడానికి సోలార్ వ్యవస్థతో పాటు వాచ్‌టవర్, కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మంటల నివారణకు చర్యలు

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి రేంజ్ పరిధిలోని యత్నారం, నిమ్మగూడెం, పెగడపల్లి అటవీ ప్రాంతాల్లో రెండు రోజులుగా అడవి అంటుకొని మంటలు వ్యాపిస్తున్నాయి. నిమ్మగూడెం, యామన్‌పల్లి ప్రధాన రహదారి వెంబడి అంటుకున్న మంటలను నిమ్మగూడెం పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేసి మంటలను ఆర్పివేశారు. అదేవిధంగా పెగడపల్లి ఇన్‌చార్జ్ రేంజర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది మంగళవారం యత్నారం, పెగడపల్లి అటవీ ప్రాంతాల్లో అంటుకున్న మంటలను ఫైర్ బ్లోయర్ ద్వారా ఆర్పివేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.